తోడ్కలు తీస్తా... బట్టలూడదీసి కొడతా

- మాట తూలితే ఫలితం ఎలా ఉంటుందో మీరే అనుభవిస్తారు
- నేను మార్చురీ వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ గురించి చేశాను
- అవును నరేంద్రమోదీ నాకు పెద్దన్ననే, అయితే ప్రాబ్లం ఏంటి?
- ఢిల్లీకి 32 సార్లు కాదు, 300 సార్లు వెళ్తాను, తప్పేంటి?
- గవర్నర్‌కు ధన్యవాదాలు చెప్పడం మర్చిపోయిన సీఎం

హైదరాబాద్, మార్చి 15(నమస్తే తెలంగాణ): శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరుగుతున్న చర్చకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం తీవ్ర విమర్శలకు గురవుతున్నది. ఒక ముఖ్యమంత్రి అయి ఉండి ఇలా ఎలా మాట్లాడుతారంటూ రాజకీయ విశ్లేషకులు ముక్కున వేలేసుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి భాష సంగతి తెలిసిందే అయినా, తాజా ప్రసంగం మరింత జుగుప్సాకరంగా ఉందని చెప్తున్నారు. సభలో రేవంత్ స్పీచ్‌లో రైతులు, జర్నలిస్టులపై తిట్ల పురాణం, నీతి, జాతి అంటూ ప్రతిపక్ష నేతలపై చేసిన జుగుప్సాకరమైన మాటలే ఉన్నాయి. తోడ్కలు తీస్తా, బట్టలూడదీసి కొడతా అంటూ యూట్యూబ్ జర్నలిస్టులపై విపరీత వ్యాఖ్యలే కనిపిస్తున్నాయి. చివరకి రైతులను కూడా దుర్మార్గులంటూ కించపరిచేలా దూషించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి 'నువ్వు అనుకుంటున్నవేమో... హద్దు దాటితే.. మాట తూలితే దాని ఫలితం ఎలా ఉంటుందో అనుభవిస్తారు' అంటూ వార్నింగ్ ఇచ్చారు. రెండున్నర గంటల పాటు సాగిన సీఎం ప్రసంగం ప్రతిపక్షాలను తిట్టడం, పథకాలపై అబద్ధాలు చెప్పడమే కనిపిస్తుంది. రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో చెప్పిన అబద్ధాలేంటి, అసలు వాస్తవాలేంటో చూద్దాం.

రేవంత్‌రెడ్డి: మరే రాష్ట్రంలో లేనివిధంగా రైతు రుణమాఫీ చేసినం.

వాస్తవం: సగం మంది రైతులు రుణమాఫీ కాలేదని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీకి అర్హులైన రైతులు 42 లక్షల మంది కాగా కేవలం 25.35 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారు. మొత్తం రూ.31వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉంటే నాలుగు విడతల్లో చేసిన మొత్తం రూ. 20,616 కోట్లు. ఇంకా 16.65 లక్షల మందికి రూ.10,384 కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉంది. కానీ మొత్తం పూర్తయిందని చెప్పడం ఏంటో!

రేవంత్‌రెడ్డి: రైతుభరోసా రూ.12వేలు ఇస్తున్నాం. నిరుడు యాసంగిలో బీఆర్ఎస్ సర్కారు ఎగ్గొట్టిన రైతుబంధు పైసలు మేమే ఇచ్చాం.

వాస్తవం: రైతుభరోసా డబ్బులు రూ.15వేలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక మాట తప్పి, రూ.12 వేలకు పరిమితమైంది. ఎన్నికల కోడ్ సాకుతో నాటి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నెపం బీఆర్ఎస్‌పైకి నెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేవంత్‌రెడ్డి: బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీ పనులు చేయలేదు

వాస్తవం: బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీ పనులు కొనసాగాయి. సీపేజీ పెరిగిందని, పనులు చేయలేమని కాంట్రాక్టు సంస్థ చేతులేత్తేయడంతో సదరు ఏజెన్సీకి అప్పటివరకు చెల్లిస్తున్న డీవాటరింగ్ చార్జీలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే సవరించింది. పనిచేస్తున్న చోటు ప్రమాదకరమని తెలిసినా, ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా, ప్రచారం కోసం పనిచేసి 8మంది కార్మికుల మృతికి కారణమైందే కాంగ్రెస్. ఇప్పుడు ఆ నెపాన్ని కూడా బీఆర్ఎస్‌పై నెట్టడం సిగ్గుచేటు అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం: సన్న వడ్లకు 1206 కోట్ల బోనస్ ఇచ్చినం.

వాస్తవం: ఎన్నికల్లో అన్ని రకాల ధాన్యానికి రూ. 500బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్. అధికారంలోకి వచ్చాక కేవలం సన్న ధాన్యానికి మాత్రమే ఇస్తున్నది. వానకాలంలో బోనస్ కింద రూ. 1206 కోట్లు ఇవ్వాల్సి ఉండగా మూడు నెలలుగా ఇంకా రూ. 400 కోట్లు చెల్లించకుండా బకాయి పెట్టింది.

రేవంత్‌రెడ్డి: ప్రజలు బీఆర్ఎస్‌ను మార్చురీకి పంపించారని అన్నాను. కేసీఆర్ వందేళ్లు బతకాలి.

వాస్తవం: 'మీకు మీరు మాకు స్టేచర్ ఉన్నదని అనుకుంటే ఆ స్టేచర్ ఉన్నదని విర్రవీగితే, స్ట్రెచర్ మీదకు పంపించిన్రు. ఇట్లే చేస్తే ఆ తర్వాత మార్చురీకి పోతరు. ఇది కూడా గుర్తు పెట్టుకోవాలి' ఇవీ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

రేవంత్‌రెడ్డి: బతుకమ్మ చీరలను రద్దు చేసి.. మహిళలకు రెండు మంచి చీరలు ఇస్తున్నాం.

వాస్తవం: మహిళలకు బీఆర్ఎస్ ప్రభుత్వం దసరాకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసింది. పథకాన్ని రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఒక్క చీర కూడా పంపిణీ చేయలేదు.

రేవంత్‌రెడ్డి: బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఏడాదిలో మా ప్రభుత్వం 57,924 ఉద్యోగాలు ఇచ్చింది.

వాస్తవం: బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకు కాంగ్రెస్ సర్కారు ఫలితాలు వెల్లడించింది. 57924 ఉద్యోగాల్లో సుమారు 47వేల ఉద్యోగాల ప్రక్రియ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తికాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 11వేల ఉద్యోగాలను మాత్రమే.

రేవంత్‌రెడ్డి: బీఆర్ఎస్ సర్కారులో రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు కావాలని అడగలేదు. మేం 8 కాలేజీలు తీసుకొచ్చినం.

వాస్తవం: ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో 5 మాత్రమే మెడికల్ కాలేజీలు ఉండగా బీఆర్ఎస్ హయాంలో జిల్లాకు ఒకటి చొప్పున 29 కాలేజీలను తీసుకొచ్చింది. 21 కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన 8 కాలేజీలకు అడ్మిషన్లకు అనుమతి తీసుకొచ్చారు రేవంత్‌రెడ్డి.

రేవంత్‌రెడ్డి: మోదీ పెద్దన్నే. ఢిల్లీకి 32సార్లు కాదు.. 300 సార్లు పోతా.

వాస్తవం: మోదీ, రేవంత్ బడేభాయ్, చోటేభాయ్ బంధం మరోసారి బయటపడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. 32 ఢిల్లీ పర్యటనల్లో ప్రధాని మోదీని 3సార్లు కలిశానని రేవంత్ స్పష్టంచేశారు. మరి మిగిలిన సమయాల్లో ఎందుకు వెళ్లినట్టు? ఎవరిని కలిసినట్టు?, ఎందుకు కలిసినట్టు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రేవంత్‌రెడ్డి: రాష్ట్రానికి 15 నెలల్లో రూ.2.20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం.

వాస్తవం: గత ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలతో మళ్లీ ఒప్పందాలు చేసుకుని, వాటిని తమ ఖాతాలో వేసుకునేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శకులు మండిపడుతున్నారు. నిరుడు జరిగిన దావోస్ ఒప్పందాలను పరిశీలిస్తే.. ఇంతవరకు ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తికాలేదు.

రేవంత్‌రెడ్డి: కృష్ణానదిపై ప్రాజెక్టులు పూర్తిచేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం దక్షిణ తెలంగాణకు అన్యాయం చేసింది.

వాస్తవం: దక్షిణ తెలంగాణకు అన్యాయం చేసిందే కాంగ్రెస్. ఉమ్మడి రాష్ట్రంలో జూరాల ప్రాజెక్టును నిర్మించినా కూడా ఎనాడూ ఎఫ్ఆర్ఎల్‌కు నింపలేదు. కేసీఆర్ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది.

రేవంత్‌రెడ్డి: కేసీఆర్ హయాంలో కృష్ణాజలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగింది.

వాస్తవం: ఆయకట్టుకే నీరందించలేక ఆపసోపాలు పడుతున్న జూరాల ప్రాజెక్టుపై భారం మీద భారం మోపిందే కాంగ్రెస్. కేసీఆర్ హయాంలో ఏడాది పొడవునా కృష్ణా జలాలు అందుబాటులో ఉండేందుకు వీలుగా 215టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం గల అతిపెద్ద జలాశయం శ్రీశైలం నుంచే చేపట్టాలని రీడిజైన్ చేశారు.

లోకం పోకడ

ఉరికించి బట్టలూడదీసి కొట్టడం చట్టంలో ఏ సెక్షన్‌లో వుందో చెబుతారా సార్?

చైర్మన్ 'న్యూసెన్స్' తొలగింపు

- బీఆర్ఎస్ సభ్యుడిపై చైర్మన్ వ్యాఖ్య పట్ల కవిత అభ్యంతరం
- తొలగించాలని డిమాండ్.. ఒప్పుకున్న చైర్మన్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బీఆర్ఎస్ సభ్యుడు తాతా మధును ఉద్దేశించి అన్న 'న్యూసెన్స్' పదాన్ని రికార్డుల నుంచి తొలిగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఆ పదం అభ్యంతరకరంగా ఉన్నట్లయితే రికార్డుల నుంచి తొలిగిస్తానని చైర్మన్ ప్రకటించారు. మండలిలో శనివారం ఉదయం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు అబద్ధాలు, అసత్యాలు చెప్తున్నారంటూ.. తాతా మధు అభ్యంతరం వ్యక్తంచేసే ప్రయత్నం చేశారు. దీంతో చైర్మన్ ఆ సభ్యుడిని వారిస్తూ.. రన్నింగ్ కామెంట్ చేయవద్దని, 'న్యూసెన్స్' చేయొద్దని గట్టిగా చెప్పారు. దీనిపై కవిత అభ్యంతరం చెప్పారు. న్యూసెన్స్ అన్న పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలని అన్నారు. వెంటనే స్పందించిన చైర్మన్ బదులిస్తూ.. ఇలాంటి అభ్యంతరకరమైన, అన్‌పార్లమెంటరీ పదాలను రికార్డుల నుంచి తొలగిస్తామని ప్రకటించారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యులకు సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గొర్రెల మేపడానికి తగిన స్థలం లేదు?

కేసీఆర్ హయాంలో ఇచ్చిన గొర్రెలు ప్రతి 8 నెలలకోసారి ఈతకు వస్తున్నాయని, దీంతో వాటి సంఖ్య పెరిగిందని బీఆర్ఎస్ సభ్యుడు ఎగ్గె మల్లేశం చెప్పారు. అయితే గొర్రెలను మేపడానికి తగిన స్థలం అందుబాటులో లేదని అన్నారు. అడవుల్లో మేపుకుందామంటే కంచెలు అడ్డు పెడుతున్నారని, ఈ విషయంపై సర్కారు దృష్టి సారించాలని కోరారు. మరో బీఆర్ఎస్ సభ్యుడు శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడం వల్ల రోజు వారీ నిర్వహణకు ఆటంకం ఏర్పడుతున్నదని చెప్పారు. బండ ప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని దవాఖానల్లో ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న నియామకాలు భర్తీ చేయాలని సూచించారు.

టీటీడీలో మన లెటర్లు చెల్లడం లేదు

ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. టీటీడీ దర్శనం, అకామిడేషన్ కోసం ఇచ్చే లెటర్లను ఏపీ సర్కారు, టీటీడీ బోర్డు అంగీకరించడం లేదని తెలిపారు. ఈ విషయంలో సర్కారు వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు చాలాకాలంగా కమిషన్లు ఇవ్వడం లేదని, వాటిని వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తాతా మధు మాట్లాడుతూ.. సత్తుపల్లిలో ఓపెన్‌కాస్టు వల్ల పర్యావరణం దెబ్బతిన్నదని, దాని వల్ల ఆ ప్రాంత ప్రజలు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, సత్తుపల్లిని పరిరక్షించాలని కోరారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్లాస్టిక్ వాడకం బాగా పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

బోనస్ అందరికివ్వలేదు: కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): వరి పంట బోనస్ అందరికీ ఇవ్వలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అంగీకరించారు. బోనస్ బోగస్ అయ్యిందని, 25 శాతం రైతులకే బోనస్ అందిందని పల్లా చెప్పగా.. కల్పించుకున్న కోమటిరెడ్డి రూ.250 కోట్లకు పైగా బోనస్ బకాయిలున్నాయని, త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

కాళేశ్వరం బంద్ అవడంతోనే నీళ్లకు ఇబ్బంది: రాంచందర్‌నాయక్

కాళేశ్వరం ప్రాజెక్ట్ బంద్ అవడంతోనే రాష్ట్రంలో నీళ్లు ఇవ్వలేకపోతున్నామని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్ అసెంబ్లీలో తెలిపారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఆయన మాట్లాడారు. కాళేశ్వరం బంద్ కావడంతో వ్యవసాయానికి, తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు.

కేంద్ర మంత్రులతో రేవంత్ దోస్తీ

బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్రమంత్రులతో దోస్తీ చేస్తూ, రాష్ట్రానికి వచ్చి బీజేపీని తిడుతున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి ఆయన శనివారం మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకే కేంద్రంపై కాంగ్రెస్ నేతలు నెపం వేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తున్నదని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డే స్వయంగా ఒప్పుకున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంలో మాస్టర్ డిగ్రీ చేశారని ఎద్దేవాచేశారు.

మేం చేసిన అప్పు..1,58,041 కోట్లు

పాత అప్పుల చెల్లింపులకే 1,53,359 కోట్లు ● వడ్డీ 64,768 కోట్లు.. అసలు 88,591 కోట్లు

అసెంబ్లీ సాక్షిగా వెల్లడించిన సీఎం రేవంత్‌రెడ్డి ● అప్పులు, మిత్తీలపై పూటకో మాట చెప్తున్న సీఎం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): తమ ప్రభుత్వం గడిచిన 14 నెలల్లో రూ.1,58,041 కోట అప్పు చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలను శనివారం అసెంబ్లీలో వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు రూ.1.58 లక్షల కోట్ల అప్పు చేసినట్టు వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, వడ్డీ కట్టడానికే తాము చేసిన అప్పులు సరిపోతున్నాయని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తాము చేసిన రూ.1.58 లక్షల కోట్ల అప్పులో రూ.88,591 కోట్లను అసలు, రూ.64,768 కోట్లను మిత్తీలకు కట్టాల్సి వచ్చిందని తెలిపారు. మొత్తం రూ.1,53,359 కోట్లను పాత అప్పులు, మిత్తీలకే కట్టినట్టు చెప్పారు. తన ప్రభుత్వం చేసిన అప్పుల తప్పులను కేసీఆర్ ప్రభుత్వానికి అంటగట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో సీఎం అడ్డంగా దొరికిపోయారు. 14 నెలల్లో రాష్ట్రానికి వచ్చిన ఆదాయం ఏమైంది, ఎటు పోయిందని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలనే ఉదహరిస్తున్నారు.

- 'ప్రతి నెల మొదటి తేదీన రూ.7 వేల కోట్లు వడ్డీయే కడుతున్నాం. ఏటా రూ.72 వేల కోట్లు మిత్తి కట్టనీకే అయితుంది' – నిరుడు జూలై 14న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం రేవంత్ వ్యాఖ్య.
- దీని ప్రకారం 15 నెలల్లో రూ.1.05 లక్షల కోట్లు మిత్తీలకే కట్టాల్సి ఉంటుంది. అసెంబ్లీలో చెప్పిన లెక్క కన్నా ఇది దాదాపు రూ.40 వేల కోట్లు తక్కువ. మరి ఏది నిజం?
- 'కేసీఆర్ హయాంలో చేసిన అప్పులకు ప్రతి నెల రూ.6,500 కోట్లు కడుతున్నాం' – గత డిసెంబర్ ఒకటిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించిన సందర్భంగా చేసిన వ్యాఖ్య.
- ఈ లెక్కన 15 నెలల్లో రూ.97,500 కోట్లు మాత్రమే చెల్లించినట్టు లెక్క. కానీ సీఎం అసెంబ్లీలో ఏకంగా రూ.1.53 లక్షల కోట్లు చెల్లించినట్టు చెప్పారు. అంటే దాదపు రూ.60వేల కోట్ల వ్యత్యాసం ఉన్నది. ఏ లెక్క కరెక్టు?
- గత ప్రభుత్వ అప్పులకు అసలు, మిత్తీకి రూ.6500 కోట్ల చొప్పున చెల్లిస్తున్నాం' – గత డిసెంబర్‌లో ఏడాది పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్య.
- ఈ లెక్కన నెలకు రూ.13వేల కోట్లు కట్టాలి. 15 నెలల్లో రూ.1.95 లక్షల కోట్లు కట్టి ఉండాలి. కానీ అసెంబ్లీలో దాదాపు 40వేల కోట్లు తగ్గించి చెప్పారు. మరి ఏ లెక్కలను నమ్మాలి?
- రాష్ట్రానికి ప్రతినెల రూ.18,500 కోట్ల ఆదాయం వస్తుంటే.. రూ.6,500 కోట్లు ఉద్యోగుల జీతభత్యాలకు ఇస్తున్నం. మరో 6,500 కోట్లు అప్పులు, వడ్డీలకింద కడుతున్నం. మిగిలిన రూ.5500 కోట్లలో రూపాయి రూపాయి కూడబెట్టి రుణమాఫీ చేశాం' – గత నవంబర్ 19న వరంగల్‌లో నిర్వహించిన ప్రజా విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య.
- ఈ వ్యాఖ్యలను బట్టి ప్రతి నెల ప్రభుత్వం కడుతున్నది రూ.6,500 కోట్లు మాత్రమే. కానీ అసెంబ్లీలో సీఎం చెప్పిన లెక్క ప్రకారం పాత అప్పులు, మిత్తీలకు నెలకు రూ.10,223 కోట్లు చెల్లిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. అంటే.. అదనంగా ప్రతి నెల కట్టిన రూ.3,723 కోట్లు ఎక్కడికి పోయినట్టు? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అసెంబ్లీలో చెప్పిన లెక్కలకు, సీఎం గతంలో చేసిన ప్రచారానికి సంబంధం లేదని విశ్లేషకులు మండిపడుతున్నారు. నెలకు అసలు, మిత్తీ కలిపి రూ.6500 కోట్లు కట్టినా... లేదా అసలు రూ.6500 కోట్లు, వడ్డీ రూ.6,500 కోట్లు కట్టినా సీఎం చెప్పిన లెక్కలకు పొంతన ఉండటం లేదని.. సీఎం ఇన్నాళ్లు చెప్పినదంతా దుష్ప్రచారమే అని చెప్పారు.

రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే

- సీఎం ప్రసంగాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్
- మార్చురీ భాషను ఖండించాలని పిలుపు
- రేవంత్ భాష తీరు మార్చుకోవాలని నినాదాలు
- మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తేతెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం శాసనమండలిలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని బీఆర్ఎస్ బహిష్కరించింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై సీఎం సమాధానం ఇస్తుండగా శాసన మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అభ్యంతరం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీ స్ట్రెచర్ మీది నుంచి మార్చురీకే అని వ్యాఖ్యానించడం, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, 10 ఏండ్లు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిన పాలనాధక్షుడైన కేసీఆర్ చావును కోరుకోవడమంటే తెలంగాణకు కీడును కోరుకోవడమేనని ఆక్షేపించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పిన తర్వాతే గవర్నర్ ధన్యవాద తీర్మానంపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులందరూ సభలో నిరసన తెలిపారు. 'సీఎం మార్చురీ భాషను ఖండిద్దాం..సీఎం భాష తీరును మార్చుకోవాలి.. కేసీఆర్‌కు సీఎం క్షమాపణ చెప్పాలి.. జై తెలంగాణ..జైజై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీఆర్ఎస్ సభ్యుల నినాదాలతో సీఎం రేవంత్ ప్రసంగించకుండానే కూర్చున్నారు. ఈ దశలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జోక్యం చేసుకొని బీఆర్ఎస్ సభ్యులు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపడం సభా సంప్రదాయమని, సీఎం సమాధానం అనంతరం ఏవైనా అభ్యంతరాలుంటే వెల్లడించాలని, సీఎం ప్రసంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయినా బీఆర్ఎస్ సభ్యులు కేసీఆర్‌కు క్షమాపణ చెప్పిన తర్వాతే ప్రసంగించాలని పట్టుపట్టారు. బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు, నినాదాల మధ్య పదే పదే మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ జోక్యం చేసుకుంటూ ఎక్కడో సీఎం మాట్లాడిన మాటలను సభలో ప్రస్తావించటం సమంజసం కాదని, కేవలం రాజకీయ ఉద్దేశంతోనే సీఎం ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే అసెంబ్లీతో దీనిపై సీఎం రేవంత్ వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పాల్సిందేనని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దాదాపు అరగంటపాటు బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు, నినాదాలతో సీఎం ప్రసంగాన్ని అడ్డుకున్నారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జోక్యం చేసుకొని సీఎం మాట్లాడిన తర్వాత ప్రతిపక్ష నేతకు మాట్లాడేందుకు అనుమతిస్తానని చెప్పారు. కానీ ముందుగా ప్రతిపక్ష నేత మధుసూదనాచారికి అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. చైర్మన్ అంగీకరించకపోవడంతో ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేయాలని నిర్ణయించుకున్నట్టు మధుసూదనాచారి ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావును కోరుకున్న నాయకుడి ప్రసంగాన్ని తాము వినేది లేదని పేర్కొంటూ వాకౌట్ చేశారు. బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వడంతో మండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదం పొందింది.

- పసుపునకు 15 వేల మద్దతు ధర చెల్లించాలి

రాష్ట్రంలో పసుపు రైతులకు రూ.15 వేల మద్దతు ధర చెల్లించాలని శాసనమండలి ఆవరణలో, మీడియా పాయింట్ వద్ద శనివారం బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు 'జై జవాన్.. జై కిసాన్'.. 'రైతు లేనిదే.. రాజ్యం లేదు' అంటూ నినాదాలు చేస్తూ పసుపు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ పాటకు ఆంధ్రా మ్యూజిక్ డైరెక్టరా?

- దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- కేసీఆర్ హయాంలో సాగుతో ఉపాధి అవకాశాలు పెరిగాయి
- రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానలలో సూది లేదు, దూది లేదు
- సాగర్ నిర్వహణ బాధ్యత తెలంగాణకు ఎందుకు రాలేదు?
- శాసనమండలిలో నిలదీసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆంధ్ర మ్యూజిక్ డైరెక్టర్‌తో రూపొందించడం ఎందుకో ఎవరికీ అర్థం కాని విషయమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. శాసనమండలిలో శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి విగ్రహాలను వేలాదిగా ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కానీ నేడు కాంగ్రెస్ సర్కారు తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మను తొలగించిందని, ఈ నిర్ణయాన్ని మెజార్టీ ప్రజలు అంగీకరించడంలేదని తెలిపారు.

సాగుతోనే జనం గోస తీరింది

తెలంగాణ రాష్ట్రంలో 2.64 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని, అందులో కాళేశ్వరం ప్రాజెక్టు పాత్ర లేదని కొందరు అంటున్నారని కవిత చెప్పారు. కానీ కోట్ల టన్నుల వరి దిగుబడి కాళేశ్వరం ప్రాజెక్టు, బీఆర్ఎస్ పాలన వల్లనే సాధ్యమైందని తెలిపారు. వ్యవసాయ రంగంలో 2.64 కోట్ల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి అయితే ఎంత మందికి ఉపాధి లభించిందో అర్థం చేసుకోవాలని సూచించారు.

సంపూర్ణ రుణమా